అంతా అబద్ధం..

- జి-20.. పర్యావరణ సదస్సుల్లో మోడీ విఫలం
- అంతర్జాతీయ వేదికలపై గొప్పలు.. ప్రయోజనం శూన్యం
- గుజరాత్ ఎన్నికల కోసమే తెరపైకి కామన్ సివిల్ కోడ్
- ఇసి చర్యలు అభ్యంతరకరం
- మీడియాతో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇటీవల ఇండోనేషియా రాజధాని బాలిలో నిర్వహించిన జి-20 సదస్సులో భారత్ అద్భుత విజయాలు సాధించిందంటూ ప్రధాని మోడీతోపాటు కేంద్ర ప్రభుత్వ పెద్దలు గొప్పలు చెప్పుకుంటున్నారని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు వ్యాఖ్యానించారు. జి-20 సదస్సుతోపాటు అంతర్జాతీయ పర్యావరణ సదస్సులోనూ మనదేశానికి అనుకూలంగా ఫలితాలు తీసుకు రావటంలో ఆయన విఫలమయ్యారని విమర్శించారు. రెండు రోజులపాటు కొనసాగే సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు శుక్రవారం హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ విజయ రాఘవన్, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో కలిసి రాఘవులు మాట్లాడారు. సంపన్న దేశాలు వడ్డీ రేట్లను పెంచుకుంటూ పోవటమనేది మనకు ప్రతికూలంగా మారిందని వాపోయారు. వాటిని తట్టుకోవాలంటే మనం వడ్డీ రేట్లనన్నా పెంచాలి.. లేదంటే సంక్షేమ పథకాలకు కత్తెరైనా వేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జీ-20 సదస్సు ద్వారా సంపన్న దేశాలు తమ వడ్డీ రేట్లను తగ్గించుకునేలా వాటిపై ఒత్తిడి తేవటంలో మోడీ విఫలమయ్యారని విమర్శించారు. పర్యావరణ పరిరక్షణ కోసం పరిశ్రమలను నియంత్రించి, కాలుష్యాన్ని తగ్గించే బాధ్యత సంపన్న దేశాలపైన్నే ఉందని అన్నారు. ఈ విషయంలోనూ ఆయా దేశాలపై మోడీ ఒత్తిడి తీసుకు రాలేకపోయారని తెలిపారు. భారతీయ మూలాలున్న రిషీ సునాక్ ఇంగ్లాండ్‌కు ప్రధాని అయినప్పటికీ... వలసదారుల పట్ల ఆయన వైఖరిలో



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బివి రాఘవులు

ఎలాంటి మార్పూ ఉండబోదని స్పష్టం చేశారు. ఇంతకుముందున్న దానికి భిన్నమైన వైఖరిని తీసుకోలేరని వివరించారు. త్వరలో ఎన్నికలు నిర్వహించనున్న గుజరాత్‌లో అభివృద్ధి నినాదం పక్కకు పోయిందని ఆయన తెలిపారు. దాని స్థానంలో కామన్ సివిల్ కోడ్ (ఉమ్మడి పౌరసత్వం), ఉచితాలను సంక్షేమ పథకాలుగా ప్రచారం చేయటమనేది ముందుకొచ్చాయని వివరించారు. వివిధ రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు... సంక్షేమ పథకాలను ఎలా అమలు చేస్తాయి..? అందుకు సంబంధించి ఎలాంటి వాగ్దానాలు ఇస్తున్నాయి..? వాటికి నిధులెక్కడి నుంచి వస్తాయంటూ ఎన్నికల సంఘం (ఇసి) ప్రశ్నించటం శోచనీయమని అన్నారు. దాని చర్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని విమర్శించారు. కేంద్రంలోని పాలక పార్టీ ఇసినీ ఈ రకంగా ఉపయోగించుకుంటోందని తెలిపారు. ఇలాంటి చర్యలు, విధానాలు ప్రజాస్వామ్యానికి, ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగిస్తాయని రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు.

విజయ రాఘవన్ మాట్లాడుతూ... దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు, తద్వారా ప్రభుత్వాలను పడగొట్టేందుకు బిజెపి శతవిధాలా ప్రయత్నిస్తున్న వైనాన్ని వివరించారు. అలాంటి పప్పులుడకని చోట గవర్నర్ల వ్యవస్థను ఉపయోగించి ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు ప్రయత్నిస్తోందని చెప్పారు. ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలకు రాజ్యాంగం ద్వారా కొన్ని హక్కులు, అధికారాలు సంక్రమిస్తాయని తెలిపారు. వాటిని గవర్నర్లు తమ అధీనంలోకి తీసుకోవటం దారుణమని వ్యాఖ్యానించారు. వారు రోజువారీ పరిపాలనా వ్యవహారాల్లో తలదూర్చటం శోచనీయమని అన్నారు. కేరళ, తమిళనాడుతోపాటు ఇప్పుడు తెలంగాణలో సైతం ఇదే తతంగం నడుస్తోందని హెచ్చరించారు అందువల్ల అలాంటి గవర్నర్లను రీకాల్ (వెనక్కు పిలవటం) చేయాలని ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న చోట... వాటిని చీల్చేందుకు బిజెపి యత్నిస్తోందని విమర్శించారు. జిఎస్‌టి అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్రాలకున్న ఆర్థిక స్వావలంబనకు తీరని విఘాతం కలుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి అనుసరిస్తున్న ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష, ప్రజాతంత్ర శక్తులన్నీ ఐక్యంగా పోరాడాలని విజయ రాఘవన్ పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో సిపిఎం అగ్రభాగాన నిలబడుతుందని చెప్పారు.

తమ్మినేని మాట్లాడుతూ... మునుగోడు ఉప ఎన్నికలో బిజెపి ఓడటం సంతోషదాయకమని తెలిపారు. ఆ ఉప ఎన్నిక సందర్భంగా సిఎం కెసిఆర్‌కు అనేక ప్రజా సమస్యలపై వినతిపత్రం సమర్పించామని అన్నారు. వాటిలో పోడు భూముల సమస్య ముఖ్యమైందని తెలిపారు. మూణ్నెల్లలోగా ఆయా భూములకు పట్టాలిస్తామంటూ సిఎం ఇటీవల హామీ ఇవ్వటం పట్ల ఆయన ధన్యవాదాలు తెలిపారు. అయితే 40, 50 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలంటూ అడిగిన వారిపై పోలీసులు దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర అటవీ హక్కుల చట్టం ప్రకారం... ఆయా సాగుదార్లందరూ పట్టాలకు అర్హులని తెలిపారు. వారందరికీ సత్వరమే పట్టాలివ్వాలని కోరారు. షెడ్యూల్ పరిశ్రమల్లో కనీస వేతనాలను సవరించాలనీ, 1998, 2008 డిఎస్‌సిల్లో సెలక్షన్ అయిన వారికి వెంటనే పోస్టులివ్వాలనీ, భార్యాభర్తలకు సంబంధించిన బదిలీల (స్పౌజ్ కేసులు) సమస్యలను మానవత్వంతో పరిష్కరించాలని కోరారు. ధరణిలో నెలకొన్న ఇబ్బందులను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. మునుగోడులో బిజెపి ఓడిపోయినప్పటికీ రాష్ట్రంలో దాని ప్రమాదం పొంచే ఉందని హెచ్చరించారు. ఆ పార్టీకి వ్యతిరేకంగా టిఆర్ఎస్ పోరాడుతున్నది కాబట్టే... ఒక ప్లాన్ ప్రకారం గులాబీ పార్టీ నేతలపై విమర్శలు, దుర్భాషలకు పాల్పడుతోందని విమర్శించారు. అయితే అదే బిజెపికి వ్యతిరేకంగా పోరాడుతున్న వామపక్షాలు, ఇతర అభ్యుదయ శక్తులను, నేతలను రాష్ట్ర పోలీసులు అరెస్టులు చేయటం, గృహ నిర్బంధాలకు పాల్పడటం శోచనీయమని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరక్కుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలు, పొత్తులు, సీట్లకు సంబంధించి ఇప్పటి వరకూ తమ పార్టీలో ఎలాంటి చర్చా జరగలేదని తమ్మినేని చెప్పారు.


కాలనీలో పర్యటిస్తున్న నారాయణ తదితరులు

'చిత్రపురి'పై సిబిఐ విచారణ జరిపించాలి

- అదో అక్రమాల పుట్ట...
- సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చిత్రపురి హౌసింగ్ సొసైటీ నిర్వహణ, కార్యకలాపాలపై సిబిఐ విచారణ జరిపించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ డిమాండ్ చేశారు. ఈ సొసైటీలో దాదాపు రూ.300 కోట్ల మేరకు అక్రమాలు జరిగాయన్నారు. సహకార సంఘ నిబంధనలకు వ్యతిరేకంగా సొసైటీని నిర్వహించి, సినిమాతో సంబంధంలేని వారికి సభ్యత్వాలు ఇచ్చారని చెప్పారు. సొసైటీ భూముల్ని అక్రమంగా తాకట్టుపెట్టి నిధులు దుర్వినియోగం చేశారన్నారు. శుక్రవారం ఆయన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య, సినీ దర్శకులు మద్దినేని రమేష్‌బాబు తదితరులతో కలిసి చిత్రపురి కాలనీలో పర్యటించారు. నిర్మాణంలో ఉన్న విల్లాలు, డూప్లెక్స్ ఇళ్లు, అపార్ట్‌మెంట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు సినీ కళాకారులు, కార్మికులు చేసిన ఫిర్యాదులకు విన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లే అవుట్ పర్మిషన్ లేకుండా నిర్మాణాలు చేపట్టారనీ, కోర్టు సీజ్ చేసిన భవనాల నిర్మాణాలను మళ్లీ ప్రారంభించారనీ, దీనికి మణికొండ మున్సిపల్ అధికారులే కారణమన్నారు. వారిపై తక్షణం క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత కమిటీని ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు పుస్తకాల నర్సింగరావు, ఓరుగంటి యాదయ్య, పనుగంటి పర్వతాలు పాల్గొన్నారు.

త్రిపుల్‌ఐటీ బాసర విద్యార్థులకు ఊరట

- ఫీజులో 40 శాతం మినహాయింపు : మంత్రి సబిత

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ స్కాలర్‌షిప్‌నకు అర్హత లేని త్రిపుల్‌ఐటీ బాసర విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. కరోనా నేపథ్యంలో గత రెండు విద్యా సంవత్సరాలకు సంబంధించి ఫీజులో 40 శాతం మినహాయింపునివ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2019-20, 2020-21 విద్యా సంవత్సరాల్లో కరోనా విస్తరించిన నేపథ్యంలో ప్రత్యక్ష తరగతులు జరగకపోవడం, వసతి గృహాల నిర్వహణ లేకపోవడం వల్ల విద్యార్థులపై భారం పడకుండా ఈ మినహాయింపునిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి విద్యార్థులకు ఊరట కల్పించిందని వివరించారు. ప్రభుత్వ పరంగా స్కాలర్‌షిప్‌నకు అర్హత ఉన్న విద్యార్థులకు సకాలంలో అది అందలేదన్న కారణంతో వారి సర్టిఫికెట్లను ఇవ్వకపోవటం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తన దృష్టికి పలువురు విద్యార్థులు తీసుకొచ్చారని పేర్కొన్నారు. స్కాలర్‌షిప్‌తో సంబంధం లేకుండా విద్యార్థులకు వారి సర్టిఫికెట్లను అడిగిన వెంటనే అందించాలని త్రిపుల్‌ఐటీ బాసర వైస్ ఛాన్సలర్ (విసి)ని మంత్రి ఆదేశించారు.



130 గ్రేట్ స్లీప్ స్టోర్లకు విస్తరించిన పెప్స్

ప్రజాశక్తి-హైదరాబాద్

ప్రముఖ పరుపుల కంపెనీ పెప్స్ ఇండస్ట్రీస్ దేశ వ్యాప్తంగా తన గ్రేట్ స్లీప్ స్టోర్లను 130కి విస్తరించింది. శుక్రవారం తన నూతన స్టోర్‌ను హైదరాబాద్‌లోని నాగోల్‌లో తెరవడం ద్వారా ఈ మైలురాయికి చేరామని పెప్స్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ కె మాధవన్ తెలిపారు.

ఈ స్టోర్ ప్రారంభోత్సవంలో ఆయనతో పాటు వైస్ ప్రెసిడెంట్ సురేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ స్టోర్ మాట్రెసెస్ ఎంపికకు అత్యంత అనుకూలంగా ఉంటుందన్నారు. పరుపుల టచ్ అండ్ ఫీల్ అనుభవాన్ని అందిస్తుందన్నారు. హైదరాబాద్‌లో తమకు ప్రస్తుతం ఆరు స్టోర్లు ఉన్నాయని.. వచ్చే ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 15 స్టోర్లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.



మారుతీ సుజుకి @ 3,500 షోరూం

ప్రజాశక్తి- హైదరాబాద్

దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి 3,500 కొత్త కార్ల విక్రయ కేంద్రాలకు విస్తరించింది. హైదరాబాద్‌లోని బేగంపేటలో శుక్రవారం నెక్సా నూతన షోరూంను తెరవడంతో ఈ మైలురాయికి చేరింది. నూతన అవుట్‌లెట్‌ను మారుతీ సుజుకి ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ, మార్కెటింగ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నోబుటకా సుజుకి లాంచనంగా ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా 2,250 నగరాల్లో విస్తృత నెట్‌వర్క్‌ను కలిగి ఉన్నట్లు వారు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ కాలంలోనే కొత్తగా 170 షోరూంలను జోడించినట్లు తెలిపారు.

నగరంలో 'డ్యురియన్' తొలి స్టోర్

ప్రజాశక్తి-హైదరాబాద్

నగరంలోని బంజారాహిల్స్‌లో తమ మొదటి స్టోర్‌ను తెరిచినట్లు లైఫ్‌స్టైల్ ఫర్నిచర్ సంస్థ డ్యురియన్ తెలిపింది. దేశ వ్యాప్తంగా 47 స్టోర్లు కలిగి ఉన్నట్లు పేర్కొంది. ఈ సంఖ్యను మరింత పెంచుకోనున్నామని వెల్లడించింది. తమ నూతన స్టోర్‌లో ఫంక్షనల్ ఫర్నిచర్, సోఫాలు, రిక్లైనర్స్, కాఫీ, సైడ్ టేబుల్స్, లాంజ్ ఛైర్స్, డైనింగ్ టేబుల్స్, బెడ్స్, బెడ్‌సైడ్ టేబుల్స్ తదితర వెయ్యికి పైగా డిజైన్లను పొందవచ్చని తెలిపింది.

హైకోర్టు తీర్పు పట్ల ఉత్తమ్ హర్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దళిత బంధు పథకానికి లబ్దిదారుల ఎంపిక ప్రక్రియలో స్థానిక ఎమ్మెల్యేల సిఫారసులు అక్కర్లేదంటూ హైకోర్టు తీర్పునివ్వడం పట్ల ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. లబ్దిదారులను గ్రామ సభల ద్వారా ఎంపిక చేయాలని కోరారు. ఐఎఎస్ అధికారులు టిఆర్ఎస్ కార్యకర్తలు మారిపోయారనీ, దీంతో లబ్దిదారులకు న్యాయం జరడం లేదని శుక్రవారం ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

27 నుంచి తేదీల్లో రైతు సంఘం రాష్ట్ర మహాసభ

- పోస్టర్ ఆవిష్కరించిన బండా శ్రీశైలం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర రెండో మహాసభను ఈ నెల 27, 28, 29 తేదీల్లో నల్లగొండలో నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండా శ్రీశైలం, జిల్లా కార్యదర్శి కున్ రెడ్డి నాగిరెడ్డి తెలిపారు. మొదటి రోజు 27న పట్టణంలో జరిగే ప్రదర్శన- బహిరంగ సభలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డికొమరయ్య భవనంలో శుక్రవారం రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు సుదీర్ఘకాలం పోరాడి విజయం సాధించిన విషయం తెలిసిందేనన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం.. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలని, విద్యుత్ సంస్కరణల బిల్లును ఉపసంహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 55 ఏళ్లు నిండిన రైతులకు రూ.ఐదు వేల పెన్షన్



మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బండా శ్రీశైలం తదితరులు

ఇవ్వాలని, కౌలు రైతులను గుర్తించి కార్డులు, పంట రుణాలు, బీమా రైతుబంధు ఇవ్వాలని కోరారు. ఆహార ఉత్పత్తుల, పాల ఉత్పత్తులపై ఐదు శాతం జిఎస్‌టిని రద్దు చేయాలని కోరారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎరువులు, పురుగుల మందుల ధరలను తగ్గించాలని, పిఎం ప్రణామ్‌ను ఉపసంహరించాలని అన్నారు. కల్తీ విత్తనాలను అరికట్టి నాణ్యమైన విత్తనాలు రైతాంగానికి మండల కేంద్రాల్లో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరపల్లి వెంకటేశ్వర్లు, మహిళా రైతు రాష్ట్ర కన్వీనర్ కందాల ప్రమీల, నాయకులు కత్తి శ్రీనివాస్ రెడ్డి, పాల్వాయి రామ్ రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, ఊట్కూరి నారాయణరెడ్డి, డిసిసిబి మాజీ వైస్ చైర్మెన్ సయ్యద్ హాశమ్, కుంభం కృష్ణారెడ్డి, సాగర్ల మల్లేశం, రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అటవీ ప్రాంత అభివృద్ధి

- ఫారెస్ట్‌ప్లస్-2.0 కార్యక్రమాల ప్రారంభంలో మంత్రి అల్లోల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అటవీ ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. అడవిపై ఆధారపడ్డ అట్టడుగు వర్గాలకు ఆర్థిక చేయూతను అందించే విధంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. యూఎస్ ఎయిడ్ , కేంద్ర అటవీ పర్యావరణ శాఖ సంయుక్త భాగస్వామ్యంతో చేపట్టిన ఫారెస్ట్ ప్లస్ 2.0 కార్యక్రమంలో భాగంగా డెసిషన్ సపోర్ట్ సిస్టం - ఆగ్రోఫారెస్ట్రీ వెబ్ పోర్టల్, కమ్యూనిటీ బేస్ట్ ఎకో సిస్టం టూరిజం, ఆగ్రోఫారెస్ట్రీ టూల్ అండ్ షేరింగ్ ఆఫ్ ల్యాండ్‌స్కేప్ మేనేజ్‌మెంట్, ప్లానింగ్ అండ్ వర్కింగ్ ప్లాన్ మాన్యువల్‌ను మంత్రి శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి ప్రారంభించారు.

అనంతరం మాట్లాడుతూ.. అటవీ అభివృద్ధి, పునరుజ్జీవనం, హరితహారం కార్యక్రమంలో భాగంగా పచ్చదనం పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం కోసం చేస్తున్న కృషిని వివరించారు. నీటిపారుదల ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, చెక్ డ్యామ్‌ల నిర్మాణం లాంటి నీటి వనరుల సంరక్షణ చర్యల వల్ల భూగర్భ జలాల మట్టం పెరిగిందన్నారు. హరితహారం ద్వారా తెలంగాణ హరిత రాష్ట్రంగా మారుతున్నదని చెప్పారు. కార్యక్రమంలో యూఎస్ కాన్సులేట్, పాలిటిక్స్, ఎకానమిక్స్ చీఫ్ షాన్ రూత్, హైదరాబాద్, అటవీ శాఖ స్పెషల్ సీఎస్ శాంతికుమారి, పిసిసిఎఫ్, సిఇఒ (కంపా) లోకేష్ జైస్వాల్, యూఎస్ ఎయిడ్ ఇండియా సీనియర్ ఫారెస్ట్రీ అడ్వైజర్ వర్గీస్ పాల్, ఫారెస్ట్ ప్లస్ 2.0 చీఫ్ ఆఫ్ పార్టీ ఉజ్వల్ ప్రధాన్, మెదక్ అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్, ఫారెస్ట్ ప్లస్ రీజనల్ డైరెక్టర్ జి. సాయిలు, అటవీ శాఖ సర్కిల్ హెడ్‌లు, అన్ని జిల్లాల అటవీ అధికారులు పాల్గొన్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

'కస్తూర్బా'లో విష వాయువు లీక్ !

- 35 మంది విద్యార్థులకు అస్వస్థత
- కళాశాలలో గ్యాస్ లీక్ కాలేదంటున్న యాజమాన్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విషవాయువుకు పీల్చడంతో హైదరాబాద్ మారేడుపల్లిలోని కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాలలో 35 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని ప్రయివేటు నర్సింగ్ హోంకు తరలించారు.

అయితే, కళాశాలలో ఎలాంటి గ్యాస్ లీక్ జరగలేదని యాజమాన్యం చెబుతోంది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. కళాశాల ప్రాంగణంలో శుక్రవారం మధ్యాహ్నం కొందరు విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. దాంతో దారిన వెళ్లేవారు కొందరు గమనించి విద్యార్థులను అడగ్గా.. కళాశాలలో గ్యాస్ లీక్ అయిందని చెప్పారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు అక్కడకు భారీగా చేరుకున్నారు. అస్వస్థతకు గురైన 35 మంది విద్యార్థులను కళాశాల అధ్యాపకులు సమీపంలోని గీత నర్సింగ్ హోమ్, చెన్నై నర్సింగ్ హోంకు తరలించారు. వైద్యులు వారికి ప్రథమ చికిత్స చేసి డిశ్చార్జ్ చేశారు. విషవాయువు పీల్చడం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని వైద్యులు చెబుతున్నారు.

అయితే, కళాశాల యాజమాన్యం మాత్రం అసలు తమ దగ్గర కెమికల్ కానీ, గ్యాస్ కానీ లీక్ కాలేదని చెబుతోంది. బయట ఉన్న చెత్త కుప్పలో నుంచి విషవాయువు వచ్చి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు అందరూ కోలుకుని ఇళ్లకు వెళ్లిపోయారని కళాశాల సొసైటీ సభ్యులు చెప్పారు. ఉస్మానియా గ్రాడ్యుయేట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలను నిర్వహిస్తున్నారు.

గీతా నర్సింగ్ హోంలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఎమ్మెల్యే సాయన్న, కార్పొరేటర్ కొంతం దీపిక, వైద్య మౌలిక సదుపాయాల సంస్థ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పరామర్శించారు.

పర్యాటకం..ఆహ్లాదకరం...

- మన తెలంగాణ-మన సంస్కృతి-మన పర్యాటకం ఆశయంతో ముందుకు
- ఎనిమిదేండ్లలో 63.51 కోట్ల టూరిస్టుల సందర్శన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మన తెలంగాణ-మన సంస్కృతి-మన పర్యాటకం ఆశయంతో పర్యాటక రంగం అభివృద్ధి కోసం రాష్ట్ర సర్కారు ముందుకుసాగుతోంది. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా పర్యాటకం వికసిస్తున్నది. కొండకోనలు.. జలపాతాలు..చారిత్రక కట్టడాలు..కోటలు..ఆధ్యాత్మిక ప్రదేశాలు..ఆహ్లాదపరిచే అడవులతో నెలవాలైన తెలంగాణం పర్యాటకులను ఇట్టే ఆకర్షిస్తోంది. 2014 నుంచి 2022 వరకు రాష్ట్రంలో 63.51 కోట్ల పర్యాటకులు సందర్శించడమే దీనికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. 1.35 లక్షల లక్షల మంది విదేశీ పర్యాటకులను ఆకర్షించింది. ప్రత్యేక రాష్ట్రంలో తెలంగాణ పర్యాటక రంగం నూతన జవసత్వాలను పోదుపోసుకున్నది. ఈ మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ అర్వింద్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, సహజ వనరుల పట్ల సంపూర్ణ అవగాహన కలిగిన ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు రాష్ట్రాన్ని ఒక పర్యాటక ప్రాంతంగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో భాగంగానే తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ని నోడల్ ఏజెన్సీగా ఏర్పాటు చేసింది. ఈ సంస్థ రాష్ట్రవ్యాప్తంగా 54 హరిత టూరిజం హొటల్స్, వేసైడ్ వసతులను కల్పించింది. పర్యాటక



రంగానికి అనువైన ప్రాంతాల్లో వసతులను అభివృద్ధి చేస్తోంది. పర్యాటక శాఖ 31 టూరిజం బస్సులు,120 బోట్‌లను నడుపుతున్నది. గోల్కొండ, వరంగల్ కోటల వద్ద సౌండ్, లైట్‌షోలను నిర్వహిస్తోంది. ఇంగ్లీష్, హిందీ, తెలుగు భాషల్లో డ్రామాటిక్‌గా ఈ కోటల కథనాలను గాత్రాలు, సంగీతం, లైట్ ఎఫెక్ట్‌తో ప్రదర్శిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనులతో భూదాన్ పోచంపల్లికి ఉత్తమ పర్యాటక గ్రామంగా ప్రపంచ పర్యాటక సంస్థ నుంచి గుర్తింపు లభించింది. నాగార్జున సాగర్ వద్ద రూ. 65 కోట్లతో బుద్ధవనం ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేసింది. ములుగు జిల్లా మేడారం గ్రామంలో సమ్మక్క - సారలమ్మ జాతరకు రూ.13.43 కోట్లతో పర్యాటక వసతులను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. లక్నవరం వద్ద రూ.27.65 కోట్లతో అదనపు వసతులను ఏర్పాటు చేసింది. తాడ్వాయిలో రూ.9.36 కోట్లు, గట్టమ్మ గుట్ట వద్ద రూ.7.36 కోట్లు, మల్లూరు వద్ద రూ.4.20 కోట్లు, బొగత వాటర్ ఫాల్స్ వద్ద రూ.11.64 కోట్లు, సోమశిల రిజర్వాయర్ వద్ద రూ.20.87 కోట్లు, సింగోటం రిజర్వాయర్ వద్ద రూ.7.84 కోట్లు, శ్రీశైలం ఈగలపెంట వద్ద రూ.25.96 కోట్లు, ఫర్హాబాద్ మన్ననూరు వద్ద రూ.13.81 కోట్లు, మల్లెల తీర్థం వద్ద రూ.5.35 కోట్లు, అక్క మహాదేవి గుహలు వద్ద రూ.1.25 కోట్లతో కల్పించిన పర్యాటక వసతులను ప్రజలకు అందుబాటులో ఉంచింది. అనేక చారిత్రక కట్టడాలను పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దుతోంది. వీటితో పాటు అన్ని జిల్లాలలోని పర్యాటక ప్రాంతాల్లో వసతులు అభివృద్ధి చేసి అంతర్గత పర్యాటకాన్ని ప్రోత్సహిస్తోంది. దీంతో డోమెస్టిక్‌తో పాటు విదేశీ పర్యాటకుల సంఖ్య కూడా పెరుగుతోంది. పర్యాటక రంగం అభివృద్ధితో వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తోంది.


అరవింద్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టిఆర్ఎస్ కార్యకర్తలు

ఎంపి అరవింద్ ఇంటిపై టిఆర్ఎస్ శ్రేణుల దాడి..!

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్సీ కవితపై బిజెపి ఎంపి అరవింద్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం తెలంగాణ జాగృతి నాయకులు, టిఆర్ఎస్ శ్రేణులు ఎంపి ఇంటిపై దాడి చేశారు. ఇంట్లోని ఫర్నీచర్, అద్దాలు ధ్వంసం చేశారు. గురువారం ఎమ్మెల్సీ కవితపై ఎంపి అరవింద్ పలు విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి ఖైరతాబాద్ నియోజకవర్గ నాయకులు పెద్ద సంఖ్యలో బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 ఎమ్మెల్యే కాలనీలో ఉన్న ఎంపి నివాసం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆయన దిష్టిబొమ్మ దహనం చేసి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇంట్లోకి కొందరు దూరి కిటికీ అద్దాలు, కొన్ని సామాన్లను ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు అక్కడకు చేరుకుని వారందరినీ అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఎంపి అరవింద్ తల్లి లీగల్ అడ్వైజర్ కరుణాసాగర్ ద్వారా బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

అనంతరం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ ఎంపి బుర్ర నరసయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఎంపి నివాసానికి చేరుకొని పరిశీలించారు. ఎంపి నివాసానికి రక్షణ లేనప్పుడు సాధారణ ప్రజలకు ఎలా రక్షణ కల్పిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతమైతే కేంద్ర ప్రభుత్వంతో చర్చించి హైదరాబాద్ నగరంలో రాష్ట్రపతి పాలన తీసుకురావాల్సి వస్తుందని కిషన్ రెడ్డి హెచ్చరించారు.

నోరు అదుపులో పెట్టుకోవాలి

- మంత్రి సత్యవతి రాథోడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎంపి అరవింద్ నోరు అదుపులో పెట్టుకోవాలని మంత్రి సత్యవతి రాథోడ్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎంపి స్థానంలో ఉండి ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, అవమానకరంగా మాట్లాడడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమని తెలిపారు. తెలంగాణకే అవమానకరంగా ఆయన ప్రవర్తన ఉందని పేర్కొన్నారు. పలు సందర్భాల్లో ఆయన తన స్థాయి మరిచి మాట్లాడారని గుర్తు చేశారు. చివరకు సిఎంనూ అనరాని మాటలు అంటున్నారని తెలిపారు. నిరాధార ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పార్లమెంట్‌లో తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై ఆయన ఏనాడు మాట్లాడలేదని విమర్శించారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

- ఐదు లక్షల కార్మికులతో ఢిల్లీ ముట్టడి
- మున్సిపల్ వర్కర్స్ యూనియన్ 4వ రాష్ట్ర మహాసభలో సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు సాయిబాబు
- హనుమకొండ జిల్లా కేంద్రంలో భారీ మహాప్రదర్శన


అభివాదం చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిఘటన పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు పి సాయిబాబు పిలుపునిచ్చారు. హన్మకొండ జిల్లా కేంద్రంలోని పబ్లిక్‌గార్డెన్ నేరెళ్ల వేణుమాధవ్ ఆడిటోరియంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర 4వ మహాసభ శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ప్రదర్శన, బహిరంగసభ నిర్వహించారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జనగామ రాజమల్లు అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో సాయిబాబు పాల్గొని మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఐదు లక్షల మంది కార్మికులతో త్వరలో ఢిల్లీని ముట్టడించనున్నట్టు తెలిపారు. శ్రమజీవులు, కార్మికుల మాట వినకపోతే కేంద్ర ప్రభుత్వానికి ఘోరీ కడతామని హెచ్చరించారు. కాలానికి ముందే పరిగెత్తే మున్సిపల్ కార్మికుల హక్కులను పరిరక్షించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలను గ్రేడ్లు, అవార్డుల కోసం అమలు చేస్తూ మున్సిపల్ కార్మికుల శ్రమను దోచుకుంటుందని ఆరోపించారు. బ్రిటీషు ప్రభుత్వంపై పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పనివిధానంతో పాటు పలు హక్కులను బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ నాలుగు కార్మిక కోడ్లుగా విభజించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు 'అగ్నివీర్' వంటి పథకాలతో సైన్యంలోనూ బిజెపి ప్రభుత్వం ప్రయివేటీకరణ ప్రారంభించిందన్నారు. రైల్వేలు, విమానాలు, బొగ్గు గనులు లాంఛ ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తున్న మోడీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్మికులకు పనిభద్రత కల్పించాలని డిమాండ్ చేస్తే పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు కనీసవేతనాలతో పాటు ప్రావిడెంట్ ఫండ్, ఇఎస్ఐను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మనం సఫాయిలం కాదు.. సిపాయిలం : పాలడుగు భాస్కర్

తామూ సఫాయిలం కాదని, సిపాయిలమని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ స్పష్టంచేశారు.

రెండేళ్ల కిందట కరోనా నేపథ్యంలో కన్నబిడ్డలు కూడా తల్లిదండ్రులను పట్టుకోలేదని, అలాంటి సందర్భంలో అనాథ శవాలను మున్సిపల్ కార్మికులే ప్రాణాలకు తెగించి ఖననం చేశారని గుర్తుచేశారు. ప్రాణాలు పోతాయని తెలిసీ తమ ప్రాణాలను ఫణంగా పెట్టిన కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. మున్సిపల్ కార్మికులకు ఆదివారాలుండవు, సెలవులుండవు, నిత్యం పనిచేస్తూనే ఉంటారని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని సిఎం ప్రకటించారని, కానీ ఇప్పటికీ అమలుచేయలేదని విమర్శించారు. 2014, 2019 ఎన్నికల్లో టిఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, రూ.26 వేలు కనీస వేతనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పొరుగునున్న ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ కార్మికులకు రూ.21 వేల కనీస వేతనం చెల్లిస్తున్నారని గుర్తు చేశారు.

దేశాన్ని అమ్మేస్తున్నారు : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రధాని మోదీ, అమిత్‌షా దేశాన్ని సంపన్నులు అంబానీలు, అదానీలకు అమ్ముతున్నారని ఎమ్మెల్సీ ఎ నర్సిరెడ్డి విమర్శించారు. ప్రధాని మోదీ సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అంటూ నినాదాలు చెబుతున్నారని, వేతనాలు, సౌకర్యాలు లేకుండా సబ్ కా వికాస్ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. ఇప్పటికే పలు బొగ్గు గనులను ప్రయివేటీకరణ చేశారని, పలు ప్రభుత్వ రంగ సంస్థలను సైతం అమ్మేశారని విమర్శించారు. స్థూల ఆర్థికాభివృద్ధి అన్ని రాష్ట్రాల కంటే మెరుగ్గా ఉందని చెబుతున్న సర్కార్ మున్సిపల్ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వడానికి ఇబ్బందేమిటని ప్రశ్నించారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో పెండింగ్ సమస్యల సాధనకు పోరాటం చేయాలన్నారు. మీ డిమాండ్లను సత్వరమే పరిష్కరించేలా శాసనమండలిలో కృషి చేస్తానని తెలిపారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎస్. రమ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని, కనీస వేతనంతోపాటు పలు కార్మిక చట్టాల అమలుపై మహాసభల్లో చర్చించి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బహిరంగసభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్, మున్సిపల్ ఉద్యోగుల సంఘం హన్మకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి ఉప్పలయ్య, రాగుల రమేష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొట్ల చక్రపాణి, జి. ప్రభాకర్‌రెడ్డి రాష్ట్ర నలుమూలల నుంచి మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

నేనున్నా.. నీకేం కాదు...

- అయ్యప్ప మాలధారుడికి కేరళ మంత్రి రాధాకృష్ణన్ వైద్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


భక్తుడికి సపర్యలు చేస్తున్న మంత్రి రాధాకృష్ణన్

అయ్యప్ప మాలేసుకుని తెలంగాణ నుంచి శబరిమలకు బయల్దేరిన ఓ భక్తుడు కేరళ చేరుకున్నారు. అక్కడి అయ్యప్ప దర్శనానికి వెళుతున్న సమయంలో మార్గమధ్యంలో అతడు తీవ్రంగా నీరసించాడు.

కాలు బెణకటంతో నడవలేక నానా ఇబ్బందీ పడ్డాడు. ముందుకు కదల్లేని పరిస్థితుల్లో మిన్నకుండిపోయాడు. ఈ క్రమంలో అటుగా వెళుతున్న కేరళ దేవాదాయ శాఖ మంత్రి కెకె రాధాకృష్ణన్... తన కారు దిగి స్వయంగా ఆ భక్తుడి వద్దకు వెళ్లి పరిస్థితిని ఆరా తీశారు. తనకు తెలిసిన ఆయుర్వేదంతో ఆయన కాలుకు స్వయంగా సపర్యలు చేసి.. వైద్యమందించారు. కొన్ని మందులు తెప్పించి ఇచ్చారు. ఆ భక్తుడికి ఉపశమనం కలిగాక అక్కడి నుంచి బయల్దేరి వెళ్లారు. తెలుగు రాష్ట్రాల నుంచేగాక ఎక్కడి నుంచి వచ్చే అయ్యప్ప భక్తులైనా ఎలాంటి అసౌకర్యం కలిగినా తమ అధికారుల దృష్టికి తీసుకొస్తే... సత్వరమే సమస్యకు పరిష్కారం చూపుతామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.


సదస్సులో మంత్రి కెటిఆర్ ఐవిపిఎ అధ్యక్షులు సుధాకర్ రావు దేశాయ్ తదితరులు

వరి పెరిగింది... ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం

- ఆయిల్ పామ్ సాగుకు రాయితీలు
- రాష్ట్ర మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సాగునీటి సౌకర్యాలతో పాటు ధాన్యం ఉత్పత్తి పెరిగిందని, ఈ క్రమంలో ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తామని రాష్ట్ర మంత్రి కె తారకరామారావు తెలిపారు. హైదరాబాద్ మాదాపూర్‌లో శుక్రవారం ఇండియన్ వెజిటేబుల్ ఆయిల్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (ఐవిపిఎ) అధ్యక్షులు సుధాకర్ రావు దేశాయ్ అధ్యక్షతన వెజ్ ఆయిల్, ఆయిల్ సీడ్ రంగంపై గ్లోబల్ రౌండ్ టేబుల్ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెటిఆర్ ప్రారంభోపన్యాసం చేస్తూ.... రాష్ట్రంలో పండిన ధాన్యాన్ని కొనలేమంటూ కేంద్రం చేతులెత్తేసిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించినట్టు తెలిపారు. ఈ క్రమంలో ఆయిల్ పామ్ సాగుకు రాయితీలు కల్పించేందుకు నిర్ణయించామని తెలిపారు. రాష్ట్రంలో పది వేల ఎకరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు చేయనున్నట్టు కెటిఆర్ వెల్లడించారు.ఆయిల్ ఉత్పత్తిలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పెట్టుబడీదారులకు పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే అతి పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం పూర్తి చేసినట్టు తెలిపారు.

రాష్ట్రంలో వంట నూనెల పరిశ్రమలకు అనువైన వాతావరణం ఉందని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తున్నామని, అవసరమైన రాయితీలు కల్పిస్తామని చెప్పారు. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. పలు ప్రాంతాల్లో ఇప్పటికే ఈ సాగు ప్రారంభమైందని తెలిపారు. పామాయిల్ తో పాటు వేరుశనగ, పొద్దు తిరుగుడు, సోయాబిన్ వంటి పంటలను పెద్ద ఎత్తున సాగు చేస్తున్నట్టు వెల్లడించారు. ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ తదితర జిల్లాల్లో సోయాబిన్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వేరు శనగ, ఇతర జిల్లాల్లో పొద్దు తిరుగుడు పంటను పండిస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో ఆయిల్ పరిశ్రమకు అవసరమైన ముడి సరుకు అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. నూనె ఉత్పత్తుల పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా ఆయిల్ దిగుమతులను తగ్గించుకోవచ్చని మంత్రి సూచించారు. దేశీయ అవసరాల్లో 60 శాతం ఆయిల్ ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో పది వేల ఎకరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నామని కెటిఆర్ తెలిపారు.

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగిందని తెలిపారు. సుధాకర్ రావు దేశాయ్ మాట్లాడుతూ ఇతర దేశాల నుంచి దిగుమతులను తగ్గించడం, మన దేశంలో ఉత్పత్తిని పెంచడం, ఉత్పత్తయిన ఆయిల్‌కు సరైన ధర వచ్చేలా చూడటం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విధానాల రూపకల్పనలు తదితరాంశాలపై సదస్సులో చర్చిస్తామని వివరించారు. రష్యా - యుక్రెయిన్ యుద్ధ వాతావరణ ప్రభావం పడినప్పటికీ ప్రత్యామ్నాయంగా ఇతర దేశాల నుంచి దిగుమతులు రావడంతో తాత్కాలికంగా ఇబ్బందులను అధిగమించగలిగామని తెలిపారు. అయితే ఆయిల్ విషయంలో భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా భారతదేశంలోనే ఉత్పత్తికి గల అవకాశాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఐవిపిఎ ఉపాధ్యక్షులు హేమంత్ బన్సల్, విపిన్ గుప్తతో పాటు వివిధ దేశాల నుంచి ఆయిల్ రంగానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

గురుకులాల పిల్లల సమస్యలు పరిష్కరించాలి

- రోనాల్డ్ రాస్‌కు పిపిఎల్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గురుకులాల్లో చదువుతున్న పిల్లల సమస్యలను పరిష్కరించాలని ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం (ప్రొగ్రెసివ్ పేరెంట్స్ లీగ్-పిపిఎల్) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం పీపీఎల్ రాష్ట్ర అధ్యక్షులు మచ్చ నర్సన్న, ఉపాధ్యక్షులు సమగళ్ల నరేష్, సంయుక్త కార్యదర్శి పులెందర్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాలయాల కార్యదర్శి రోనాల్డ్ రాస్ ను కలిసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. భోజన సదుపాయం, శీతాకాలం ప్రారంభమైనా ఇప్పటికీ బ్లాంకెట్లు ఇవ్వకపోవడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారనితెలిపారు. అలాగే సరూర్ నగర్ పాఠశాలలో జరిగిన ఘటనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆ ఘటనపై నివేదిక సమర్పించండి

- డిజిపికి గవర్నర్ ఆదేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ ఎంపి అరవింద్ ఇంటిపై దాడి ఘటనకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని రాష్ట్ర డిజిపి మహేందర్ రెడ్డిని, రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ ఆదేశించారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఎంపి ఇంటిపై దాడి, ఆయన కుటుంబ సభ్యులను బెదిరించడం, వారు సహాయం కోసం అర్థించడం తీవ్రంగా ఖండించదగిన అంశాలని ఆమె పేర్కొన్నారు. దీనిపై నివేదిక సమర్పించేందుకు ప్రాధాన్యతనివ్వాలని కోరారు.



నాపై పోటీచేసి గెలువండి

- ఎమ్మెల్సీ కవితకు ఎంపి అరవింద్ సవాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దమ్ముంటే తనపై పోటీచేసి గెలవాలని ఎమ్మెల్సీ కవితకు నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ సవాల్ విసిరారు. కవిత తనపై చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన దిశ సమావేశంలో ఎంపి అరవింద్ పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. తాను లేని సమయంలో హైదరాబాద్‌లో తన ఇంటిపై దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

తన ఇంట్లో 70 ఏండ్ల తల్లి, 75 ఏండ్ల తండ్రి ఉన్నారని, వాళ్ళని భయభ్రాంతులకు గురి చేయడం ఏమిటని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఇంటిపై దాడిచేయడంతో ఇంట్లో ఉన్న మహిళలు భయభ్రాంతులకు గురయ్యారన్నారు. కిటికీలు, అద్దాలు, కారు అద్దాలు, దేవుడి పటాలు ధ్వంసం చేయడం ఏం సంస్కృతి అని ప్రశ్నించారు. కెసిఆర్, కెటిఆర్, కవిత ముగ్గురు కుల అహంకారంతో దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత కాంగ్రెస్ వాళ్ళతో టచ్‌లో ఉందో లేదో ఆమెనే తేల్చుకోవాలని, కాంగ్రెస్ వాళ్లకు కవిత ఫోన్ చేసినట్టు తనకు సమాచారం ఉందని తెలిపారు. అందరి ఫోన్లు ట్రాప్ చేసే ప్రభుత్వం కవిత ఫోన్ కూడా వింటే అసలు విషయం తెలుస్తుందన్నారు. కవిత తనపై పోటీకి సిద్ధమా అని ప్రశ్నించారు. టిఆర్ఎస్ పార్టీలో కవిత రాజకీయ భవితవ్యంపై అభద్రాతాభావంతో ఉన్నారని ఆరోపించారు. పార్టీలో సమస్యలు పరిష్కరించుకోవాలి తప్ప విపక్షాలపై నిందలు వేయవద్దని అరవింద్ హితవు పలికారు.

సిపిఐ కంటే బిజెపి పెద్ద పార్టీ కాదు ...

- త్వరలో 119 నియోజకవర్గాల్లో ఎన్నికల కమిటీలు
- వచ్చేనెల 7న చలో రాజ్‌భవన్ ముట్టడి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని వెల్లడి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సిపిఐ కంటే బిజెపి పెద్ద పార్టీ కాదనీ, అన్ని జిల్లాల్లో తమ పార్టీకి బలముందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. రాష్ట్రంలో ఇంతకు బిజెపి ఉన్నదా? అని ఆయన ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్ మఖ్దూం భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ, తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు, ఎన్ బాలమల్లేశ్, ఇటి నర్సింహాతో కలిసి కూనంనేని విలేకర్లతో మాట్లాడారు. గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 7న 'చలో రాజ్‌భవన్‌ముట్టడి' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో సర్వే ద్వారా గుర్తించిన ప్రజా సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు నిర్వహిస్తామన్నారు. దేశంలో బిజెపి తిమింగలంగా మారిందని విమర్శించారు. బలం ఉందో, లేదో అనేది తెలయనివారు తామే సిఎం అని చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బిజెపిని వ్యతిరేకించే బలమైన ప్రజాస్వామ్య పార్టీలతో అంశాల ప్రతిపాదికన, ఆయా సందర్భాల్లో కలిసి నడవాలని నిర్ణయించామని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో బిజెపిని నిలువరించాల్సిన అవసరముందని చెప్పారు. ప్రస్తుత పద్ధతినే భవిష్యతులో టిఆర్ఎస్ కొనసాగిస్తే, ఎన్నికల అవగాహన ఉండే అవకాశాలున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని 119 నియోజకర్గాల్లో ఎన్నికల కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. తమ పార్టీ బలంగా ఉన్న 25 నియోజకవర్గాలను గుర్తించామన్నారు. నియోజకవర్గాల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో శిక్ష పడకుండా బిజెపి తప్పించుకుంటుందని విమర్శించారు. బిజెపికి వ్యతిరేకంగా కాంగ్రెస్ తన పాత్రను మార్చుకుంటే మంచిదని హితవు పలికారు. నెహ్రూ సూచించిన విధానాలను కాంగ్రెస్ క్రమక్రమంగా వదులుకుంటున్నట్టు కనపడుతున్నదన్నారు. కాంగ్రెస్‌ను తాము లౌకికవాద పార్టీగా పరిగణిస్తుంటే, ఆ పార్టీ మాత్రం మతోన్మాద విషయంలో బిజెపితో పోటీగా వ్యవహరిస్తోందని చెప్పారు.

నూతన రాష్ట్ర కార్యదర్శి వర్గం ఎన్నిక

సిపిఐ రాష్ట్ర నూతన కార్యదర్శి వర్గాన్ని రాష్ట్ర సమితి ఎన్నుకుంది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు శుక్రవారం నూతన కార్యదర్శి వర్గాన్ని ప్రకటించారు. సెప్టెంబర్‌లో జరిగిన సిపిఐ రాష్ట్ర తృతీయ మహాసభలో రాష్ట్ర సమితిని ఎన్నుకోగా, రాష్ట్ర సమితి రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్న విషయం తెలిసిందే. నూతన కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, కార్యదర్శివర్గ సభ్యులుగా చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ, తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు, ఎన్ బాలమల్లేశ్, బాగంహేమంత్‌రావు, కలవేని శంకర్, ఎం.బాలనర్సింహా, విఎస్ బోస్, ఇటి నర్సింహా ఎన్నికయ్యారు.

మధురస్వరం ఒక వరం

- ప్రముఖ నటుడు సుమన్

ప్రజాశక్తి - కల్చరల్

అందరూ గాయకులు కాలేరని మధురంగా స్వరం ఉండడం ఒక వరమని ప్రముఖ నటుడు సుమన్ అన్నారు. తన సినిమాలు విజయవంతం కావటానికి సగం క్రెడిట్ బాలసుబ్రహ్మణ్యం గాత్రమేనని అన్నారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై స్వర రాగ నీరాజనం సాంస్కృతిక సంస్థ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వర్ధమాన, ప్రవర్ధమాన గాయనీ గాయకులు ఇరవై మందిపైగా పదుల పాటలను యజ్ఞ తుల్యంగా అలపించి ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అధికార భాషా సంఘం అధ్యక్షులు మంత్రి శ్రీదేవి పాల్గొని మాట్లాడుతూ గాయకులు తమ స్వరానికి తగ్గ పాటను ఎంచుకోవడం ప్రధానమన్నారు. ఆలా ఎంచుకుని అందరూ పాడారని, వారిని ప్రోత్సాహించిన యామిని నల్గొండ జిల్లా మట్టి బిడ్డ అని కొనియాడారు. మహిళ సాధికారికతకు ప్రతీక యామిని అన్నారు. కేంద్ర పూర్వ మంత్రి వేణుగోపాలాచారి యామిని బృందంను అభినందించారు. వేదికపై నటుడు జ్వాల చక్రవర్తి, గాయకుడు రమణ, సంస్థ సలహాదారు ప్రణయ్ పాల్గొనగా యామిని కార్యక్రమాన్ని నిర్వహించారు.

స్కానింగ్ పేరిట స్కామ్

- పాత పుస్తకాలు, నవలలు స్కాన్ చేస్తే సరిపోతుందని కుచ్చుటోపీ
- 10 వేల పేజీల స్కానింగ్‌కు రూ.50 వేల సంపాదన
- 620 మంది నుంచి రూ.15 కోట్లు వసూళ్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో మరో భారీ మోసం బయట పడింది. పాత నవలలు, పాత పుస్తకాలు స్కానింగ్ చేసి ప్రతినెలా వేలకువేలు సంపాదించుకోవచ్చని నమ్మించి మోసం చేసిన ముగ్గురు అంతర్‌రాష్ట్ర నేరస్థులను సిసిఎస్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జాయింట్ సిపి భూపాల్ గజారావు వివరాలు వెల్లడించారు.

ఢిల్లీకి చెందిన దీపక్ శర్మ, ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌కు చెందిన సయ్యద్ సమీర్ ఉద్దీన్, ఆశిస్ కుమార్, అమిత శర్మ ఒక ముఠాగా ఏర్పడ్డారు. సులువుగా డబ్బులు సంపాదించాలని ఢిల్లీలో 'డిజినల్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్'ను ఏర్పాటు చేశారు. దాని బ్రాంచ్‌ను హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోనూ తెరిచారు. ఇంటి వద్ద నుంచి పాత నవలలు, పాత పుస్తకాలు స్కానింగ్ చేసుకోవచ్చని దినపత్రికల్లో, ఎస్ఎంఎస్, సోషల్‌మీడియాలో పెద్దఎత్తున ప్రచారం చేశారు. ప్రతి నెలా 10 వేల పేజీలను స్కానింగ్ చేయడం వల్ల రూ.50 వేలు సంపాదించుకోవచ్చని, తమకు అమెరికా, యూరప్ దేశాల నుంచి వర్క్ ఆర్డర్ ఉందని నమ్మించారు. నిజమని నమ్మిన వారు బంజారాహిల్స్‌లోని కార్యాలయానికి వెళ్లి పెద్దఎత్తున డబ్బు డిపాజిట్ చేశారు. మొదట మూడు, నాలుగు నెలలపాటు బాధితులకు సక్రమంగా డబ్బులు చెల్లించారు. వారిని పూర్తిగా నమ్మించి రూ.5 లక్షలు డిపాజిట్ చేస్తే మరింత వర్క్ ఆర్డర్ ఇస్తామని చెప్పారు. ఈ క్రమంలో 620 మంది నుంచి రూ.15 కోట్లకుపైగా డిపాజిట్లు సేకరించారు. ఈ ఏడాది జులై నుంచి కార్యాలయం మూసేయడంతో బాధితులు ఆందోళనకు గురయ్యారు. ఆరా తియ్యగా నిందితులు పరారైనట్టు గుర్తించిన బాధితులు సీసీఎస్‌లోని వైట్‌కాలర్ విభాగంలో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన ఏసీపీ ఎస్.వి.హరికృష్ణ నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలోవున్న దీపక్ శర్మ కోసం గాలిస్తున్నామని జాయింట్ సీపీ తెలిపారు.

నకిలీ సర్టిఫికెట్లకు అడ్డుకట

- టెన్త్, ఇంటర్ ధ్రువపత్రాలపై త్వరలో నిర్ణయం
- మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- స్టూడెంట్ అకడమిక్ వెరిఫికేషన్ సర్వీస్ పోర్టల్ ఆవిష్కరణ
- అలాంటి వారిపై పిడి యాక్ట్ నమోదు చేస్తాం : డిజిపి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోనే ఇదో మైలురాయి అని విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. నకిలీ సర్టిఫికెట్లకు అడ్డుకట్ట పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం డిగ్రీ, పీజీ కోర్సులకు సంబంధించిన సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని చెప్పారు. త్వరలోనే టెన్త్, ఇంటర్ విద్యార్థుల ధ్రువపత్రాలపైనా నిర్ణయం తీసుకుంటామనీ, వారి సర్టిఫికెట్లను ఈ పోర్టల్ పరిధిలోకి తెస్తామని అన్నారు. హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో శుక్రవారం 'స్టూడెంట్ అకడమిక్ వెరిఫికేషన్ సర్వీస్ (ఎస్ఎవిఎస్)' పోర్టల్‌తోపాటు రీడిజైన్ చేసిన ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌నూ మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇది ఒకరోజులో చేసిన పని కాదన్నారు. విసిలు, అధికారులు, పోలీసులు ఎంతో చొరవ చూపారని చెప్పారు. అందరూ బాగుండాలంటూ సిఎం కెసిఆర్ కోరుకుంటారని వివరించారు. రైతు విత్తనం వేసినప్పటి నుంచి పంట చేతికి వచ్చే వరకు ఎలా కష్టపడతారో విద్యార్థులూ ప్రతి ఏటా అలాగే ఉంటారని అన్నారు. మోసాలకు పాల్పడుతున్న వారికి అడ్డుకట్ట వేసేందుకే ఈ పోర్టల్‌ను తెచ్చామన్నారు. నకిలీ విత్తనాలను ఎలా అడ్డుకట్ట వేస్తున్నామో అలాగే నకిలీ సర్టిఫికెట్లకూ అడ్డుకట్ట వేయాల్సిన అవసరముందని చెప్పారు. వాటిని నివారించేందుకు పోలీసు శాఖ కృషి చేస్తోందని వ్యాఖ్యానించారు. నకిలీ సర్టిఫికెట్ల అడ్డుకట్ట వేసేందుకు ఓ పోర్టల్‌ను తీసుకురావడం దేశంలోనే మొదటిది అని అన్నారు. ఒక అడుగు ముందుకు పడిందన్నారు. ఈ పోర్టల్‌లో ఉన్న సర్టిఫికెట్లు నమ్మకంగా ఉంటాయని చెప్పారు. నకిలీలకు తావులేదన్నారు. పకడ్బందీగా అమలు చేస్తామనీ, ఇందుకు పర్యవేక్షణ చాలా ముఖ్యమని అన్నారు.

నకిలీ సర్టిఫికెట్లుండొద్దు : డిజిపి

ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఎక్కడా నకిలీ సర్టిఫికెట్లుండొద్దని డిజిపి ఎం మహేందర్‌రెడ్డి చెప్పారు. విసిలు, విద్యాశాఖ అధికారులతో కలిసి ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఉద్యోగం, ఉన్నత విద్యకెళ్లినా ఇది దోహదపడుతుందని చెప్పారు. అయితే నకిలీ సర్టిఫికెట్లను సృష్టించే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామనీ, పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ వ్యవస్థను నిర్మూలించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు.

2010 నుంచి అందుబాటులో సర్టిఫికెట్లు : లింబాద్రి

రాష్ట్రంలోని వ్యవసాయం, ఆరోగ్య కలిపి 15 విశ్వవిద్యాలయాల్లోని 2010 నుంచి విద్యార్థులకు చెందిన సర్టిఫికెట్లు ఈ పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయని ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి చెప్పారు. ఉద్యోగం, ఉన్నత విద్యకు వెళ్లాలంటే నకిలీ సర్టిఫికెట్లు పెద్ద సమస్యగా ఉందన్నారు. దానికి అడ్డుకట్ట వేసేందుకే ఈ పోర్టల్‌ను తెచ్చామని వివరించారు. ఎవరు ఎక్కడి నుంచైనా ఇందులో సర్టిఫికెట్లను పరిశీలించొచ్చని సూచించారు. సమయం, ప్రయాణించడం వంటివి ఉండబోవని చెప్పారు. ఉద్యోగం పొందేవారికి, ఇచ్చే వారికి దోహదపడుతుందన్నారు. వెంటనే సర్టిఫికెట్ గురించి తెలుసుకోవాలంటే ఉచితంగా సేవలుంటాయని అన్నారు. ఆ విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలు పొందాలంటే రూ.1,500 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఐదుగురి విద్యార్థులపై ఎఫ్ఐఆర్ నమోదు : వెంకటమరణ

త్రిపుల్‌ఐటీ బాసరలో ఐదుగురి విద్యార్థులపై ఎఫ్ఐఆర్ నమోదైందని ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్, త్రిపుల్‌ఐటీ బాసర విసి వి వెంకటరమణ అన్నారు. ఆ విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై శనివారం అత్యవసర క్రమశిక్షణా కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. డిసెంబర్ రెండోవారంలో వర్సిటీ స్నాతకోత్సవం నిర్వహిస్తున్నామనీ, మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ఆహ్వానించామని చెప్పారు.